తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460

https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

శుక్రవారం

08 మే 2026

సంపుటి 03

సంచిక 210

పేజీలు 8

వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైంది

- చౌటుప్పల్ మార్కెట్‌లో హరీశ్ రావు విమర్శలు
- రైతులను తరుగు పేరుతో దోచుకుంటున్నారని ఆరోపణ
- యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్




యాదాద్రి భువనగిరి, మే 07 రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెలు ఆగిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు.నెల రోజులుగా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని

మిగతా 2వ పేజిలో..

# చదువుపై తగ్గుతున్న ఆసక్తి

- విద్యార్థుల భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళన
- మొబైల్ వ్యసనం, సామాజిక మాధ్యమాల ప్రభావం తీవ్రం
- మార్కుల ఒత్తిడితో మానసికంగా కుంగిపోతున్న విద్యార్థులు
- పుస్తకాలకంటే తెరలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్న కొత్త తరం



డెస్క్, మే 08 దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి తగ్గుతున్న పరిస్థితి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తల్లో ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు పాఠశాల ముగిసిన తర్వాత కూడా పుస్తకాలతో సమయం గడిపే విద్యార్థులు ఇప్పుడు మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, ఆటల ప్రపంచంలో ఎక్కువగా మునిగిపోతున్నారు. సాంకేతిక అభివృద్ధి విద్యకు ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ అదే సాంకేతికత విద్యార్థుల దృష్టిని చదువుల నుంచి దూరం చేస్తోందని నిపుణులు చెబుతున్నారు. గంటల తరబడి చిన్న వీడియోలు చూడడం, ఆటలు ఆడడం, రాత్రివేళల వరకు మొబైల్ వినియోగించడం వల్ల ఏకాగ్రత తగ్గిపోతోందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దీని ప్రభావం చదువు సామర్థ్యంపై మాత్రమే కాదు, మానసిక ఆరోగ్యంపైనా పడుతోందని హెచ్చరిస్తున్నారు.

మరోవైపు మార్కుల ఆధారిత విద్యా వ్యవస్థ కూడా విద్యార్థుల్లో చదువుపై ఒత్తిడిని పెంచుతోంది. జ్ఞానం కోసం చదవాల్సిన విద్య ఇప్పుడు మార్కుల పోటీగా మారిపోతోందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలనే ఒత్తిడి కారణంగా చాలామంది విద్యార్థులు మానసిక ఆందోళన, భయం, నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇతరులతో పోల్చడం, తల్లిదండ్రుల అంచనాలు, పోటీ పరీక్షల ఒత్తిడి విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. చదువు ఆనందంగా కాక భారంగా మారిపోవడం వల్ల చాలా మంది విద్యార్థులు పుస్తకాల పట్ల ఆసక్తి కోల్పోతున్నారని పేర్కొంటున్నారు.

కరోనా తర్వాత ఆన్‌లైన్ విద్య విస్తరించడం విద్యార్థుల అలవాట్లలో పెద్ద మార్పులు తీసుకొచ్చింది. మొబైల్, కంప్యూటర్ వినియోగం అవసరానికి మించి పెరగడంతో పుస్తక పఠనం తగ్గిపోయింది. ఒకప్పుడు గ్రంథాలయాల్లో సమయం గడిపే విద్యార్థులు ఇప్పుడు మొత్తం సమాచారాన్ని తెరల ద్వారానే పొందేందుకు అలవాటు పడిపోయారు. దీని ప్రభావం భాషా పరిజ్ఞానం, ఆలోచనా శక్తి, విశ్లేషణ సామర్థ్యంపై పడుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఎక్కువసేపు

మిగతా 2వ పేజిలో..



## ఆపరేషన్ సిందూర్ దేశ గర్వకారణం

- నాంపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో ఘన కార్యక్రమం
- పహల్గామ్ ఉగ్రదాడిని గుర్తు చేసిన నాయకులు
- ఉగ్రవాదంపై భారత్ వైఖరి స్పష్టమని రాంచందర్ రావు వ్యాఖ్యలు

హైదరాబాద్, మే-07 గత సంవత్సరం ఇదే రోజున భారత్ ప్రారంభించిన "ఆపరేషన్ సిందూర్" చారిత్రాత్మక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు దేశ భద్రత, ఉగ్రవాద నిర్మూలనపై కేంద్ర ప్రభుత్వ కట్టుబాటును గుర్తు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు

మిగతా 2వ పేజిలో..

## ఫార్మా సిటీ రైతుల పక్షాన పోరాడుతాం

- బషీర్‌బాగ్ అఖిలపక్ష సమావేశంలో కల్వకుంట్ల కవిత హెచ్చరిక
- భూసేకరణ వెంటనే నిలిపివేయాలని డిమాండ్
- రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం



హైదరాబాద్, మే-07 ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను వెంటనే రైతులకు తిరిగి ఇవ్వాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గురువారం


మిగతా 2వ పేజిలో..



## ఉగ్రవాదానికి భారత్ గట్టి సమాధానం ఇస్తుంది : ప్రధాని మోదీ

- ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తి
- సైనిక దళాల సేవలను కొనియాడిన ప్రధాని
- దేశ భద్రత విషయంలో రాజీ లేదని స్పష్టం

2వ పేజిలో..



## మధ్యాహ్న భోజనంలో పాము పిల్ల కలకలం

- 250 మందికి పైగా విద్యార్థులు అస్వస్థత
- భోజనం తిన్న వెంటనే వాంతులు, కడుపు నొప్పితో విలవిలలాడిన చిన్నారులు
- ఆసుపత్రుల వద్ద తల్లిదండ్రుల ఆందోళన.. ఘటనపై విచారణ ప్రారంభం

బిహార్, మే 07 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నాణ్యతపై మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. బిహార్ రాష్ట్రంలోని సహర్సా జిల్లాలో చోటుచేసుకున్న ఓ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజనంలో పాము పిల్ల

మిగతా 2వ పేజిలో..

## ఉగ్రవాదానికి పాక్ మద్దతును ఖండించిన భారత్



- సింధూ జలాల ఒప్పందం నిలిపివేతపై విదేశాంగ శాఖ స్పష్టీకరణ
- ఆపరేషన్ సిందూర్‌తో తగిన బదులిచ్చామని వెల్లడి
- ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్ విధానమని జైశంకర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, మే 07 పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదానికి ఇస్తున్న మద్దతును భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాద చర్యలకు ప్రతిస్పందనగానే భారత్ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసిందని స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ తొలి వార్షికోత్సవం సందర్భంగా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి ద్వారా సీమాంతర ఉగ్రవాదం అసలు స్వరూపాన్ని ప్రపంచం చూసిందని జైస్వాల్ పేర్కొన్నారు. ఉగ్రవాదానికి పాకిస్థాన్ అందిస్తున్న ప్రోత్సాహానికి భారత్ ఆపరేషన్

మిగతా 2వ పేజిలో..



## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

- మూడు రోజుల పాటు వానలు కురిసే అవకాశం
- ద్రోణి ప్రభావంతో తగ్గనున్న ఉష్ణోగ్రతలు
- ఉరుములు, ఈదురుగాలులపై వాతావరణ శాఖ హెచ్చరిక

2వ పేజిలో..


# తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

హైదరాబాద్, మే 07 తెలుగు రాష్ట్రాల్లో మండుతున్న ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఊరటనిచ్చే సమాచారం వెల్లడించింది. కర్ణాటక నుంచి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ వాతావరణ మార్పుల ప్రభావంతో గత కొన్ని రోజులుగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణలో జోగులాంబ గద్వాల, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. చెట్ల కింద నిలబడకుండా, అవసరం లేకుండా బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని తెలిపింది. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కోతకు వచ్చిన పంటలను భద్రపరుచుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది.

## ఉగ్రవాదానికి భారత్ గట్టి సమాధానం ఇస్తుంది : ప్రధాని మోదీ

దేశ భద్రత విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడదని ప్రధానమంత్రి మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాద శక్తులు దేశాన్ని భయపెట్టాలని ప్రయత్నించిన ప్రతీసారి భారత సైన్యం తగిన సమాధానం ఇస్తోందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తైన సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భారత సాయుధ దళాల ధైర్యసాహసాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పహల్గామ్‌లో అమాయక భారతీయులపై జరిగిన దాడి దేశాన్ని తీవ్రంగా కలచివేసిందని మోదీ పేర్కొన్నారు. ఆ ఘటన తర్వాత భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాద శక్తులకు గట్టి హెచ్చరికగా నిలిచిందని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సైనికులు అసాధారణ ధైర్యం, కచ్చితత్వం, వ్యూహాత్మక నైపుణ్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. దేశ ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్న జవాన్లకు ప్రతి భారతీయుడు రుణపడి ఉంటాడని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ భారత్ సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అన్నారు. భూసేన, నౌకాదళం, వైమానిక దళం సమన్వయంతో ఈ ఆపరేషన్ విజయవంతమైందని చెప్పారు. సరిహద్దుల్లో దేశాన్ని కాపాడేందుకు సైనికులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. దేశ భద్రత కోసం తమ జీవితాలను అంకితం చేసిన వీర జవాన్ల త్యాగాలను ఎప్పటికీ మరవలేమని అన్నారు. స్వదేశీ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడం వల్లే భారత సైన్యం మరింత శక్తివంతంగా మారుతోందని ప్రధాని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విధానాలతో రక్షణ రంగంలో స్వయం సమృద్ధి పెరుగుతోందని చెప్పారు. దేశీయంగా తయారవుతున్న ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం వల్ల భారత సైనిక దళాల సామర్థ్యం మరింత పెరిగిందని వెల్లడించారు. ప్రపంచ దేశాలు కూడా ఇప్పుడు భారత్ రక్షణ రంగాన్ని గౌరవంతో చూస్తున్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. దేశంపై దాడి చేసే శక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. భారత భూభాగం, ప్రజల భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని పిలుపునిచ్చారు. సైనిక దళాలకు గౌరవ సూచకంగా ప్రజలు తమ సామాజిక మాధ్యమాల ఖాతాల్లో ప్రత్యేక చిత్రాలను ప్రదర్శించాలని ప్రధాని సూచించారు. సైనికుల త్యాగాల వల్లే దేశ ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. యువత దేశభక్తి భావనతో ముందుకు రావాలని, దేశ రక్షణలో తమ వంతు బాధ్యతను గుర్తుంచుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, ఈ నెల 10న బెంగళూరులో జరిగే ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ 45వ వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. అక్కడ నిర్మించిన ప్రత్యేక ధ్యాన మందిరాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ఆధ్యాత్మిక గురువులు, ప్రముఖులు హాజరయ్యే అవకాశముంది.

## చదువుపై తగ్గుతున్న ఆసక్తి



చదవలేకపోవడం, పాఠాలు గుర్తుంచుకోలేకపోవడం, దృష్టి కేంద్రీకరించలేకపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరగాలంటే కుటుంబాలు, పాఠశాలలు, సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలపై అధిక ఒత్తిడి కాకుండా ప్రోత్సాహం ఇవ్వాలని, చదువును ఆనందదాయకంగా మార్చాలని చెబుతున్నారు. పాఠశాలల్లో సృజనాత్మక బోధన, ప్రయోగాత్మక విద్య, చర్చా విధానాలు పెంచితే విద్యార్థుల్లో నేర్చుకునే ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. అలాగే మొబైల్ వినియోగంపై నియంత్రణ, పుస్తక పఠనం అలవాటు, ఆటలు, వ్యాయామం, కుటుంబ సభ్యులతో సమయం గడపడం వంటి అంశాలు విద్యార్థుల మానసిక వికాసానికి ఎంతో ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైంది

➢ మొదటి పేజీ తరువాయి

మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్నారని, కానీ వాస్తవ పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని హరీశ్ రావు అన్నారు. తాను ఏసీ గదుల్లో కూర్చొని మాట్లాడడం లేదని, రైతుల మధ్య నిలబడి వారి గోడును వింటున్నానని వ్యాఖ్యానించారు. తేమ పరీక్షకు పదిరోజులు, గోనె సంచుల కోసం మరో వారం, తూకం వేయడానికి మరో వారం పడుతోందని ఆరోపించారు. మిల్లులకు వెళ్లిన తర్వాత కూడా లారీల వద్ద బస్తాలకు కటింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. చౌటుప్పల్ మార్కెట్‌లో వర్షం పడితే వడ్ల కుప్పలు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, యూరియా, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

# ఆపరేషన్ సిందూర్ దేశ గర్వకారణం

➢ మొదటి పేజీ తరువాయి

ఎన్ రాంచందర్ రావు మాట్లాడుతూ 2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి దేశాన్ని తీవ్రంగా కలచివేసిందన్నారు. అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రగిలించిందని పేర్కొన్నారు. ఆ ఘటన తర్వాత భారత్ దృఢంగా స్పందించాలని నిర్ణయించుకుందని తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఉగ్రవాదంపై రాజీ లేని వైఖరిని అవలంబించిందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమనే సందేశాన్ని భారత్ ప్రపంచానికి స్పష్టంగా తెలియజేసిందన్నారు. “ఉగ్రవాదం, వాణిజ్యం కలిసి సాగవు.. రక్తం, నీరు కలిసి ప్రవహించవు” అనే సందేశంతో భారత్ తన దృఢసంకల్పాన్ని ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. దేశ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశ సైనిక శక్తి, రాజకీయ సంకల్పం ప్రపంచానికి వెల్లడైందని అభిప్రాయపడ్డారు. దేశ సమగ్రత, భద్రత కోసం ప్రతి భారతీయుడు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువ మోర్చా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశ భద్రతకు అంకితభావంతో పనిచేస్తున్న సాయుధ దళాలకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# మధ్యాహ్న భోజనంలో పాము పిల్ల కలకలం



కనిపించడంతో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ఇప్పటికే ఆ ఆహారం తిన్న 250 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సహర్సా జిల్లాలోని మహిషి బ్లాక్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంగా అన్నం, పప్పు వడ్డించారు. సాధారణంగా భోజనం చేస్తున్న సమయంలో కొంతమంది విద్యార్థులు పాత్రలో పాము పిల్లను గమనించారు. దీంతో అక్కడ ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. అయితే అప్పటికే వందలాది మంది విద్యార్థులు ఆహారం తినడం పూర్తిచేసినట్లు సమాచారం.

ఆహారం తిన్న కొద్దిసేపటికే విద్యార్థుల్లో తీవ్ర అస్వస్థత లక్షణాలు కనిపించడం ప్రారంభమైంది. కడుపు నొప్పి, వాంతులు, తల తిరగడం, బలహీనత వంటి సమస్యలతో చిన్నారులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కొందరు విద్యార్థులు ఏడుస్తూ స్పృహ తప్పినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పరిస్థితి మరింత విషమించడంతో ఉపాధ్యాయులు వెంటనే అప్రమత్తమై విద్యార్థులను సమీప ఆరోగ్య కేంద్రాలకు తరలించారు. ఒకేసారి భారీ సంఖ్యలో విద్యార్థులు ఆసుపత్రులకు చేరుకోవడంతో అక్కడ తీవ్ర రద్దీ ఏర్పడింది. వైద్యులు అత్యవసర చికిత్సలు అందిస్తూ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించారు. కొంతమంది విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. వైద్య బృందాలు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నాయి.

ఈ ఘటనతో తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు అందించే భోజనంలో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని మండిపడ్డారు. పాఠశాల ఆవరణలో పెద్ద సంఖ్యలో చేరుకున్న గ్రామస్థులు, తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘటనపై స్పందించిన జిల్లా అధికారులు వెంటనే పాఠశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మధ్యాహ్న భోజన నమూనాలను సేకరించి పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఆహార తయారీలో ఎక్కడ నిర్లక్ష్యం జరిగిందో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సహర్సా సివిల్ సర్జన్ డాక్టర్ రాజనారాయణ్ ప్రసాద్ పరిశీలించారు. ప్రస్తుతం పిల్లల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా, మధ్యాహ్న భోజన పథకంపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను



కచ్చితంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఫార్మా సిటీ రైతుల పక్షాన పోరాడుతాం

➢ మొదటి పేజీ తరువాయి

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో “ఫార్మా సిటీలో ఏం జరుగుతోంది” అంశంపై నిర్వహించిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఫార్మా సిటీ భూసేకరణ కోసం తీసుకొచ్చిన జీవో 31ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల అంగీకారం లేకుండానే భూములు సేకరించారని ఆరోపించారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ పేర్లతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోబోమని హెచ్చరించారు.

గత ప్రభుత్వం ఫార్మా సిటీ విషయంలో అసత్యాలు చెప్పిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. కోర్టులో ఒక విధంగా, ప్రజల ముందు మరో విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ రక్షణ సేన ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కవిత మండిపడ్డారు. బుల్లెట్ ట్రైన్, డేటా సెంటర్లు, భారీ పెట్టుబడుల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. డేటా సెంటర్ల వల్ల కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఎకరాకు ఇచ్చే పరిహారం రైతుల భవిష్యత్తుకు సరిపోదని కవిత అన్నారు. రైతుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధి పేరుతో గ్రామీణ ప్రాంతాలను నష్టపరిచే ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు. రైతుల పంట కొనుగోళ్ల విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని కవిత ఆరోపించారు. భవిష్యత్తులో పంట కొనుగోళ్లు ఎత్తివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ఉగ్రవాదానికి పాక్ మద్దతును ఖండించిన భారత్

➢ మొదటి పేజీ తరువాయి

సిందూర్ ద్వారా తగిన సమాధానం ఇచ్చిందని తెలిపారు. “సీమాంతర ఉగ్రవాదం చాలా కాలంగా పాకిస్థాన్ ప్రభుత్వ విధానంలో ఒక సాధనంగా మారింది. ఉగ్రవాదానికి పాక్ ఇస్తున్న మద్దతుకు ప్రతిస్పందనగానే భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. పాకిస్థాన్ వెంటనే ఉగ్రవాద మద్దతును ఉపసంహరించుకోవాలి” అని రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై ప్రపంచ పోరాటాన్ని బలోపేతం చేసేందుకు భారత్ నిరంతరం కృషి చేస్తోందని విదేశాంగ శాఖ పేర్కొంది. దేశ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది. మరోవైపు కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా ఆపరేషన్ సిందూర్‌పై స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు భారత్ దృఢంగా నిలిచిందన్నారు. సీమాంతర ఉగ్రవాదం నుంచి దేశాన్ని రక్షించుకునేందుకు చేపట్టిన చర్యల్లో ఆపరేషన్ సిందూర్ కీలకమని పేర్కొన్నారు. ఉగ్రవాద చర్యలకు జవాబుదారీతనం ఉండేలా భారత్ వ్యవహరించిందని జైశంకర్ తెలిపారు. “ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ అనే స్పష్టమైన సందేశాన్ని భారత్ ప్రపంచానికి ఇచ్చింది” అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా భారత సాయుధ దళాల శౌర్యాన్ని ప్రశంసించారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే శక్తులు భారత త్రివిధ దళాల నుంచి తప్పించుకోలేవని ఆపరేషన్ సిందూర్ నిరూపించిందన్నారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం కచ్చితత్వం, ధైర్యం, సమన్వయం ప్రపంచానికి తెలియజేసిందని పేర్కొన్నారు. నిఘా సంస్థలు, సైనిక దళాలు, వ్యూహాత్మక నాయకత్వం సమర్థవంతంగా పనిచేసిన విధానం ప్రశంసనీయమని అభిప్రాయపడ్డారు.

## తిరుమల లడ్డూ వ్యవహారంపై హై లెవెల్ కమిటీ

ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
సీఎస్ నేతృత్వంలో నివేదికపై సమగ్ర అధ్యయనం
వారం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పణ

అమరావతి, మే-07 తిరుమల లడ్డూ తయారీలో నాణ్యత, వివాదస్పద అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ఏక సభ్య కమిటీ నివేదికను సమగ్రంగా పరిశీలించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన హై లెవెల్ కమిటీని నియమించింది.

ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా, డీజీపీ, న్యాయ శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. నివేదికలో పేర్కొన్న సాంకేతిక, పరిపాలన, న్యాయపరమైన అంశాలను ఈ కమిటీ లోతుగా అధ్యయనం చేయనుంది. లడ్డూ తయారీలో నిబంధనల ఉల్లంఘనలు ఎక్కడ జరిగాయో గుర్తించడం, అందుకు గల కారణాలను విశ్లేషించడం కమిటీ ప్రధాన బాధ్యతగా ప్రభుత్వం పేర్కొంది. బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై కూడా కమిటీ మార్గదర్శకాలు రూపొందించనుంది.

హై లెవెల్ కమిటీ తన నివేదికను వారం రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. తిరుమల లడ్డూ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. తిరుమల లడ్డూ ప్రపంచవ్యాప్తంగా భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని ప్రభుత్వం పేర్కొంది. నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. ఈ వ్యవహారంలో పారదర్శకంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడే దిశగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

## స్థానిక ఉత్పత్తులను ప్రపంచ బ్రాండ్లుగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత
పెట్టుబడులకు అడ్డంకులు తొలగించాలని అధికారులకు ఆదేశం

అమరావతి, మే 07 : ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యే ఉత్పత్తులకు నాణ్యత, సరైన బ్రాండింగ్ జోడిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ప్రారంభమైన 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధిపై సమీక్షిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రోజువారీ వినియోగ వస్తువుల కొనుగోలు ద్వారా పెద్ద మొత్తంలో డబ్బు విదేశాలకు వెళుతోందని సీఎం పేర్కొన్నారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని తెలిపారు. “అరకు కాఫీ ప్రపంచవ్యాప్తంగా బ్రాండ్‌గా నిలిచినట్లే, ప్రతి జిల్లా నుంచి ప్రత్యేక ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్లుగా తీర్చిదిద్దాలి” అని కలెక్టర్లకు సూచించారు.

రాష్ట్రానికి వస్తున్న భారీ పరిశ్రమలకు అనుబంధంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యవస్థను బలోపేతం చేయాలని చంద్రబాబు అన్నారు. గూగుల్ డేటా సెంటర్ రావడంతో ఇతర అంతర్జాతీయ సంస్థలు కూడా పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. డేటా సెంటర్లకు అవసరమైన పరికరాలు, క్వాంటం కంప్యూటింగ్ రంగానికి సంబంధించిన ఉపకరణాల తయారీలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషించాలని సీఎం సూచించారు.

## ఎర్రగుంట తండా గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి

• గ్రామ సర్పంచ్ రమావత్ హన్మ



**నల్గొండ అర్బీ, మే 7, తరంగాలు :**

ఎర్రగుంట తండా గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నానని గ్రామ సర్పంచ్ రమావత్ హన్మ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గ్రామ సర్పంచ్గా గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు . ప్రజలకు ఇచ్చిన హామీలను ఐదు సంవత్సరాల కాలంలో నెరవేరుస్తానని అన్నారు. గ్రామంలో అన్ని సిసి రోడ్లు వేయిస్తానన్నారు. ఇందిరమ్మ ఇళ్ళను అర్హులైన వారందరికీ మంజూరు చేయిస్తానని అన్నారు. ప్రభుత్వ స్కూల్లోని ఒక గదిని తీసుకొని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని నడుపుతున్నామన్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు చాలా తక్కువగా వస్తున్నాయని అన్నారు. డ్రైనేజీ సమస్య కూడా అధికంగా ఉందని దానిని కూడా అధికమిస్తామన్నారు. ఇంకా అర్హత కలిగిన నిరుపేదలకు ఇల్లు మంజూరు చేయటానికి కృషి చేస్తున్నాను గ్రామములో కరెంటు సమస్య కూడా ఉన్నది, తాను చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు గ్రామస్తులు సహకరిస్తున్నారు వారికి నా ధన్యవాదములు.

## మేడారం గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నాను

• గ్రామ సర్పంచ్ గొంగడాల వెంకటయ్య



**నల్లగొండ అర్బీ, మే 7, తరంగాలు :**

మేడారం గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నానని గ్రామ సర్పంచ్ గొంగడాల వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను అధిక మెజార్టీతో గెలిపించిన గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి ఇచ్చిన హామీలన్నిశీటిని నెరవేర్చడానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో మంచినీటి సమస్య తీర్చడానికి ఇప్పటివరకు తాను రెండు బోర్లను వేయించానని అన్నారు. 20 వరకు స్తంభాలు వేయించినట్లు తెలిపారు. గ్రామానికి 15 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని అన్నారు. ఇంకా అర్హత కలిగిన నిరుపేదలకు ఇల్లు మంజూరు చేయించడానికి కృషి చేస్తానన్నారు. గ్రామంలో కరెంటు సమస్య, డ్రైనేజీ సమస్య బాగా ఉందని అన్నారు. భూగర్భ జలాలను పెంచడానికి ఇంకుడు గుంతలను గ్రామంలో తీస్తున్నామన్నారు. తాను చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు కు ప్రజలు అని రకాలుగా సహకరిస్తున్నారు.

## సిసి రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ తాటికాయల మమత



**జఫర్గడ్ ప్రతినిధి, మే 7,(తరంగాలు):**

మండలంలోని సాగరంలో సిసి రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ తాటికాయల మమత చేతన్. రూ. 5 లక్షల సిడిఎఫ్ నిధులతో ప్రారంభించినారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కత్తుల సుమన్, మాజీ సర్పంచ్ బట్టి ఇన్నారెడ్డి, వార్డు సభ్యులు వరికిల మహేశ్వర రావు కత్తుల కోటి, గ్రామ నాయకులు పిన్నింటి రాజు, సమ్మాలు, నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు

## స్మగ్లర్ల అరెస్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్సై రామ్మోహన్

• అభినందించి, నగదు రివార్డ్ అందజేసిన కమిషనర్ ఆఫ్ పోలీస్ - సన్ ప్రీత్ సింగ్ ( ఐపీఎస్ )




**తరంగాలు, మే, 07, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట నియోజకవర్గశీ ఖానాపురం మండలం పరిధిలో మూగజీవాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాకు చెందిన నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో అత్యంత ప్రతిభ కనబరిచిన ఖానాపురం ఎస్సై గుగులోత్ రామ్మోహన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ అభినందిస్తూ సిపి కార్యాలయంలో ఎస్సై రామ్మోహన్ కు నగదు రివార్డును సైతం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ పాల్గొన్నారు.

# గీత కార్మికులకు కాటమయ్య సేఫ్టీ కిట్ల ట్రైనింగ్




**జఫర్గడ్ ప్రతినిధి మే 7,(తరంగాలు):**

జనగామ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలం లోని తీగారం, ఓబలాపూర్, జఫర్గడ్, వడ్డే గూడెం, గ్రామాల గీత కార్మికులకు కాటమయ్య సేఫ్టీ కిట్ల ట్రైనింగు ను గడ్డం శ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆధ్వర్యంలో తీగారం గ్రామంలో ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ తిగారం గ్రామంలో గౌడ సంఘం సొసైటీ భూమి 6 ఎకరాల 21 (6:21) గుంటల భూమిఉన్నందున అట్టి భూమిలో మరి కొద్ది రోజులలో తాడి చెట్లు,ఈత చెట్లు, ద్రాక్ష చెట్లు, పెట్టాలని వారు సంఘాన్కి సూచించారు. ఇట్టి కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా జిల్లా కోఆర్డినేటర్ బాల్నే వెంకట మల్లయ్య విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని వృత్తుల కంటే ప్రమాదకరమైనది కల్లుగీత వృత్తి రాష్ట్రం లో రోజు రోజుకు ఎక్కడో ఒకచోట తాడిచెట్టు నుండి పడి మరణించడం కాళ్ళు చేతులు విరగడం దెబ్బలు తగిలినయ్ అని వినడం జరుగుతుంది .కావున కాటమయ్య సేఫ్టీ కిట్లు వాడాలని అన్నారు. కిట్టు వాడడం వల్ల ఎలాంటి ప్రమాదం లేదని అన్నారు. మీ తల్లి,తండ్రి, భార్య మీ పిల్లలు కుటుంబ సభ్యులు మీ బంధువులకు అందరికీ ఒక భరోసా తాడిచెట్లు ఎక్కడానికి పోయిండు తిరిగి క్షేమంగా ఇంటికి వస్తాడని ఒక భరోసా ఉంటుంది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అధితిగా పాలకుర్తి ఎక్సైజ్ సీ ఐ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న కాటమయ్య రక్షణ కిట్టు వల్ల ఎలాంటి ప్రమాదం లేదని చెప్పారు ప్రతి ఒక్క గీత కార్మికుడు కిట్టు వాడి మీ కుటుంబాన్ని కాపాడుకోవాల్సిందిగా కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో ట్రేనర్స్ కుర్ర ఉప్పలయ్య, కనకటి రాజయ్య, బాల్నే కార్తీక్ టి సిఎస్ తీగారం మాజీ అధ్యక్షులు గడ్డం రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, గడ్డం రాకేష్, తవిటి పెద్దశ్రీనివాస్, తవిటి రాకేష్, తవిటి శ్రవణ్, కుమార్, తవిటి సురేష్, తవిటి రామ్మూర్తి,తవిటి సతీష్, తవిటి నగేష్ ముంజ నరేందర్ , గుండెబోయిన సతీష్, పొన్నం లక్ష్మణమూర్తి , తవిటి హరి, తవిటి యాదగిరి, తౌటీ శేఖర్, తవిటి అజయ్, తవిటి కృష్ణంరాజు, తప్టి నాగరాజు, బైరగొని నాగరా జు, తప్టి రతన్ కుమార్, ఎక్సైజ్ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర కీలకం, క్షేత్రస్థాయిలో నిత్యం తనిఖీలు నిర్వహించాలి

• జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్




**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే. 07, తరంగాలు:**

గ్రామాల అభివృద్ధిలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారుల పాత్ర కీలకం అని, ప్రతిరోజు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సానిటేషన్, త్రాగునీరు సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాల అమలు, పెన్షన్ పరిశీలన ఆమోదం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతి, ఓవర్ వాటర్ హెడ్ ట్యాంకర్, పరిశు భ్రత, మిషన్ భగీరథ నీరు సరఫరా, తదితర ప్రతి విభాగానికి సంబంధించిన పనులలో గ్రామపంచాయతీ కార్యదర్శులను భాగస్వామ్యులను చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవోలకు సూచించారు, పేదవాడి సొంత ఇంటి కల సహకారం చేయడం కోసం ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిబంధన ప్రకారం కమిటీల ద్వారా మంజూరు చేసి అందించాలని ఇప్పటికే మంజూరు చేసిన వాటి వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు, మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీరును అందిస్తూ ఇతర నీటి వనరులను ఏర్పరుచుకోవాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు.

గ్రామస్థాయిలో ఉన్న ప్రతి ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీన్ చేపిస్తూ ఉండాలని, శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు, గ్రామస్థాయిలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని, లేబర్ టర్నోవర్ పెంచాలని తెలిపారు,అంతర్గత రోడ్ల, అభివృద్ధి పనులు పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, తదితర సదుపాయాలను ప్రజలకు అందిస్తూ పచ్చదనం పరిశుభ్రత పాటించాలని తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధంగా ప్రతిరోజు ఉదయం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు, గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉండాలని, అందుకు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు,ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో, (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, అన్ని మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## పలు శుభ కార్యాలలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

• మల్లిబాబు యాదవ్, షేక్ ఫతే మహమ్మద్, చిత్తారి సింహాద్రి యాదవ్



**ఇల్లందు ప్రతినిధి మే 7,( తరంగాలు ):**

కామేపల్లి మండలం కొత్త లింగాల గ్రామానికి చెందిన కొరివి నాగరత్నం ( ఇస్సాకు)- రమాదేవి దంపతుల కూతురు విజయ కుమారి- కళ్యాణ్, చుంచుపల్లి మండలం హౌసింగ్ బోర్డు అంబేద్కర్ నగర్ గ్రామానికి చెందిన తోకల చంద్రావు- సాయమ్మ ల కుమారుడు వివాహం సందర్భంగా కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి, అలాగే పండితాపురం గ్రామానికి చెందిన చల్లా యాదగిరి - యశోద దంపతుల కుమారుడు రాజేష్- ఇందు, ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన బత్తుల యుగంధర్ -జ్యోతి కూతురు వివాహంకు, ముచ్చర్ల గ్రామానికి చెందిన ఎల్లబోయిన సురేష్ - స్వప్న ల కూతురు కృత్విక్ నారాయణ, కుమారుడు కృతిక నారాయణ ల నూతన పట్టు వస్త్రాల అలంకరణ వేడుక స్థానిక శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్ లో జరిగింది. పలు శుభకార్యాలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ జెడ్పిటిసి మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ పతే మొహమ్మద్, అఖిల భారత యాదవ యువజన జిల్లా అధ్యక్షులు చిత్తారి సింహాద్రి యాదవ్.



## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

• రైతులకు అవగాహన కల్పించిన అధికారులు



**పాలేరు ఆర్సీ, మే 7 (తరంగాలు) :**

రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో రామడుగు వాణి అన్నారు. గురువారం కూసుమంచి రైతు వేదికలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా రైతు వారోత్సవంలో నాలుగో రోజున విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలు, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ రంగంలో డ్రోన్ల ప్రాముఖ్యత మొదలగు అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ కూసుమంచి, పాలేరు ఏఈలు ఖదీర్, తావుర్య పాల్గొని రైతులకు పీఎం కుసుం పథకం గురించి అవగాహన కల్పించారు. అనంతరం రైతులు పాటించవలసిన జాగ్రత్తలు, ఈ విధంగా విద్యుత్ ను ఆదా చేసుకోవాలి మొదలగు అంశాపై అవగాహన కల్పించారు. అనంతరం రైతు శిక్షణా కేంద్రం ఏవో అరుణకుమారి వ్యవసాయ రంగంలో డ్రోన్ల ప్రాముఖ్యత, వ్యవసాయ యాంత్రికరణ గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి రైతులకు వానాకాలం సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట అవశేషాలు తగలబెట్టడం వల్ల కలిగే అనర్థాలు, విత్తనాల కొనుగోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పచ్చి రొట్ట ఎరువుల ప్రాముఖ్యత, ప్రాముఖ్యత పొందిన వరి రకాల సాగు, మొదలగు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి గ్రామ సర్పంచ్ కొండ కృష్ణవేణి, నాయకన్ గూడెం గ్రామ సర్పంచ్ సైదమ్మ, రాజుపేట గ్రామ సర్పంచ్ మహేష్, తురకగూడెం సర్పంచ్ కృష్ణ, పోచారం సర్పంచ్ గురుమూర్తి, వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ, రవీందర్, సాయిరాం, రవి, నవీన్, సౌమ్య, ప్రియాంక, ఉద్యాన విస్తరణ అధికారి విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## రైతుల కోసమే అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్

### వ్యవసాయ శాఖ అధికారి- సతీష్



**నందు ప్రతినిధి మే 7, ( తెలంగాలు ):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా అధికారి పంపిఛన అగ్రి లీగల్ క్లినిక్ డిప్యూటేషన్ పత్రాన్ని ఇల్లందు మండల వ్యవసాయ కార్యాలయంలో ఏవో సతీష్ కి జిల్లా పారాలీగల్ వాలెంటీర్ సతీష్ ఖండేల్వాల్ అందజేశారు. ఈ సందర్భంలో వ్యవసాయ అధికారి సతీష్ మాట్లాడుతూ, రైతు కోసమే అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఉందని అందులో రైతులకు న్యాయ సలహాదారుడిగా నియమించారని ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రైతులకు భూమి, నీరు, క్రిమిసంహారక మందులు, మార్కెటింగ్ చట్టాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అన్యాయం జరిగిందని భావించే రైతులు కోర్టుకు వెళ్లకుండా ఈ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందవచ్చని పిఎల్వి సతీష్ ఖండేల్వాల్ తెలిపారు.

## మత్స్యరైతులు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి...



**పాలేరు ఆర్సీ, మే 7 (తరంగాలు) :**
మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం హైదరాబాదు వారి ఆధ్వర్యంలో, మత్స్య శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు వారి సహకారంతో, భారతీయ వ్యవసాయ, పరిశోధన మండలి, న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో, తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్, షెడ్యూల్డ్ క్యాస్ట్ మత్స్య కారులకు జరుగుతున్న జలాశయాలలో చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు అను అంశంపై 3రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం మొదటి రోజు గురువారం విజయవంతంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, ఖమ్మం జిల్లాల నుంచి 25 మంది మత్స్య కారులు హాజరైనట్లు పాలేరు స్థానం శాస్త్రవేత్త శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు రైతులకు పలు అంశాలపట్ల అవగాహన కల్పించారు.

## నేడు మల్లేపల్లిలో మెగా పశువైద్య శిబిరం

- మండల పశువైద్యాధికారి ఆర్ నీలకాంత్



**పాలేరు ఆర్సీ, మే 7 (తరంగాలు) :**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి నివేదిక 99రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం (నేడు) మండలంలోని మల్లేపల్లి గ్రామంలో మెగా పశు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి ఆర్ నీలకాంత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో సమగ్ర పశుసంవర్ధక సూచనలు, సలహాలు, చికిత్స అందుతుందని తెలిపారు. రైతులకు మేలు జాతి దూడలపెంపకంపై, పశుగ్రాసం పెంచడం, అందుకు సంబంధించిన ప్రభుత్వం అందించే గడ్డిగింజలు, వాటి పెంపకం వంటి విషయాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అంతేకాకుండా పశువులలో సంతోనోత్పత్తి సూచనలు, వేసవి కాలంలో ప్రత్యేకంగా పశువులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరం ఉదయం 7గంటల 30నిమిషాలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. పశువైద్య సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు. ప్రతి ఒక్కరు ఈ శిబిరంలో పాల్గొని జయప్రదం చేయాలని వైద్యాధికారి కోరారు.

## అట్లా పావనికి నాట్య వసుందరి 2026 అవార్డు ప్రధానం



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, మే. 07, తరంగాలు:**
కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామానికి చెందిన తల్లిదండ్రులు సట్ల పావని ప్రభాకర్ ల కుమార్తె చిన్నారి సట్ల శ్రీనిధి కి "నాట్య వసుందరి 2026" అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని ఏపీ తెలంగాణ భవన్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన నేషనల్ డాన్స్ అవార్డు ఫెస్టివల్‌లో ఈ అరుదైన గౌరవాన్ని చిన్నారి శ్రీనిధి సొంతం చేసుకుంది.దేశంలోని పలు రాష్ట్రాల నుండి పాల్గొన్న ప్రతిభావంతుల మధ్య తెలంగాణ సంస్కృతి,సంప్రదాయ నృత్య కళను అద్భుతంగా ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకుంది.చిన్నారి విజయంలో తల్లిదండ్రులు సట్ల ప్రభాకర్, శ్రీమతి పావని మరియు గ్రామస్తులు ఆనంద వ్యక్తం చేశారు.

## సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిరోధిద్దాం....

# "ప్రజా ఆరోగ్యాన్ని రక్షిద్దాం"

- మున్సిపల్ చైర్ పర్సన్ - పెండెం శ్రీలక్ష్మి రామానంద్
- ఏఎస్ఆర్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు- ఎర్రబోయిన రాజశేఖర్



**తరంగాలు, మే :07, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**
నర్సంపేట పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్లాస్టిక్ వాడకం నిషేధం పై ఫంక్షన్ హాల్స్ మరియు హోటల్స్, టిఫిన్ సెంటర్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ శ్రీలక్ష్మి రామానంద్ మాట్లాడుతూ సింగిల్ యూస్ వస్తువులైన ప్లాస్టిక్ కప్పులు, గ్లాసులు, స్పూన్లు, ప్లేట్లు, స్ట్రాలు, మరియు 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న క్యారీ బ్యాగులను హోటళ్లలో వాడకూడదని అన్నారు. ప్లాస్టిక్ భూమిలో కరగడానికి వందల ఏళ్లు పడుతుందని, ఇది భూగర్భ జలాలను కలుషితం చేయడమే కాకుండా మనం ఆహారంతో కూడిన ప్లాస్టిక్ కవర్లను బయటపడేయడం ద్వారా పశువులు ఆహారంతో పాటు ప్లాస్టిక్ కవర్లను కూడా తినడం ద్వారా వాటి ప్రాణాలకు ముప్పుగా మారుతోందని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులలో వేడి ఆహారాన్ని తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది అన్నారు. కావున ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడం మనందరి బాధ్యత అని ప్లాస్టిక్ ను నిషేధించి, మన ఆరోగ్యాన్ని మరియు ప్రకృతిని రక్షించుకుందాం అన్నారు. 15 రోజుల్లోగా హోటల్స్, టిఫిన్ సెంటర్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నిషేధించాలని యజమానులను కోరారు. లేనియెడల నిషేధిత ప్లాస్టిక్ వాడితే జరిమానాలు విధిస్తామని అన్నారు. ఫంక్షన్ హాల్స్ నందు భోజన సమయంలో పేపర్ ప్లేట్స్ బదులుగా తాటి, అరటి ఆకు ప్లేట్లను వినియోగించే విధంగా యజమానులు శుభకార్యాలు చేసుకునే వారికి అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లలో వేడి వేడి ఆహారాన్ని తిని అనారోగ్య బారిన పడవద్దని అన్నారు. ప్లాస్టిక్ కవర్స్ బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం జరిగిందని హోటల్స్ మరియు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమానులు ప్రజల ఆరోగ్యాన్ని రక్షించే బయో కవర్లు ఉపయోగించాలని కోరారు. ఇలాంటి సమాజానికి ఉపయోగపడే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏఎస్.ఆర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఎర్రబోయిన రాజశేఖర్ కు మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రామకృష్ణ, కౌన్సిలర్ పొన్నాల మనీషా, ఫంక్షన్ హాల్, హోటల్స్, టిఫిన్ సెంటర్ మరియు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమానులు, ప్లాస్టిక్ వస్తువులుఅమ్మే షాప్ యజమానులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చైర్మన్ వెంకన్న, తహశీల్దార్ వివేక్...



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే. 07, తరంగాలు:**
రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని కేసముద్రం సింగిల్ విండో చైర్మన్ దికొండ వెంకన్న అన్నారు. గురువారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రం సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ దికొండ వెంకన్న, తహశీల్దార్ వివేక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ గ్రామాల్లోనే కేంద్రాలు ఉండటం వల్ల రైతులకు రవాణాభారం తగ్గుతుందన్నారు.అధికారులు ఎక్కడా అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరిపి, సకాలంలో చెల్లింపులు అయ్యేలా చూడాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల మేరకు ధాన్యాన్ని ఎండబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయానికి తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రావుల వినయ్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్స్ బీరం గోపాల్ రెడ్డి, తోట శోభా నాగన్న, గూగులోత్ రాంజీ నాయక్, మహేందర్ రెడ్డి, నంద, నూనావత్ శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కీర్తి సురేందర్, సీఈవో ఎల్లయ్య, సిబ్బంది రమేశ్, రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వెలమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం పట్ల హర్షం



**పర్వతగిరి, తరంగాలు (మే 07):**
వెలమ కులస్థులలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని, వారి విద్యా, ఉపాధి, స్వయం ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వెలమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం పట్ల పర్వతగిరి వెలమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మా శ్రేయస్సు కోసం మొట్ట మొదటిసారిగా వెలమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి సంఘం తరపున అజయ్ రావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వెలమ కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేలా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యా రుణాలు, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు స్వయం ఉపాధి పథకాలు, చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహాయం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు ఈ కార్పొరేషన్ ద్వారా అందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా ఉన్నాయని తెలిపారు. వెలమ కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద కుటుంబాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, యువత భవిష్యత్తుకు ఇది ఉపయోగకరంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సంక్షేమ నిర్ణయాలు కొనసాగించాలని పర్వతగిరి వెలమ సంఘం తరుపున కోరారు.

## మొక్కజొన్న కొనుగోలుపై సమావేశం నిర్వహణ



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి,మే.07,తరంగాలు**
కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ రెడ్డి అధ్యక్షతన పిఎసిఎస్ ధనసరి అధ్యక్షులు మర్రి రంగారావు, పిఎసిఎస్ కేసముద్రం అధ్యక్షులు దీకొండ వెంకన్న, రైతు సంఘ నాయకులు,కేసముద్రం తహసిల్దార్ వివేక్,సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, సబ్ ఇన్స్పెక్టర్ క్రాంతి కిరణ్, ఆధ్వర్యంలో కేసముద్రం మార్కెట్ ఆవరణంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయు మొక్కజొన్న బస్తాలను లారీల కొరత ఉన్నందున వ్యవసాయ మార్కెట్ యార్డు కేసముద్రం నందు గల ఓపెన్ షెడ్లలో లాట్ల పద్ధతిన నిల్వ చేయుటకు గాను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మార్క్ ఫెడ్ శాఖ మరియు ప్రాథమిక వ్యవసాయ సంఘాలు గ్రామాల వారీగా కొనుగోలు చేసిన బస్తాలను నిలువ చేయుటకు ఒక ప్రణాళిక తయారు చేయడం జరిగిందని వివరించారు.
వ్యవసాయ శాఖ మరియు సహకార శాఖ అధికారులు గ్రామాల వారీగా గ్రామాలలో మొక్కజొన్నల నాణ్యతా ప్రమాణాలు పరీక్షించిన తర్వాత రైతులకు టోకెన్ జారీ చేయడం జరుగుతుందన్నారు. టోకెన్ జారీ చేసిన రైతులు ట్రాక్టర్ల ద్వారా బస్తా కు 51 కిలోల చొప్పున బస్తాలు నింపి వే-బ్రిడ్జి పై కాంటా వేసి మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి మార్క్ ఫెడ్ కు అమ్ముకోవాలని నిర్ణయించడం జరిగినది.రైతులు తమ మొక్కజొన్న పంటను యాసంగి-2025 సీజన్లో పంట నమోదు అయినదో లేదో చెక్ చేసుకొని ఎన్ని బస్తాలు అర్హత ఉందో అంతవరకే తీసుకు రాగలరు.రైతులు నింపే బస్తాలు డ్యామేజీ లేకుండా, కుట్టు వేసుకొని, చెక్ చేసుకుని తీసుకు రాగలరనీ మార్కెట్ కమిటీ చైర్మన్ తెలిపారు.

## తెలంగాణ జన సమితి పార్టీ 4వ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ



**వర్ధన్నపేట ప్రతినిధి,మే 7,తరంగాలు:** తెలంగాణ జన సమితి పార్టీ నాలుగో ప్లీనరీ పోస్టర్ ను వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ జన సమితి పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలిశాల రాజేష్ మాట్లాడుతూ నీళ్లు నిధులు నియామకాలపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో గత పాలకులు వారి కుటుంబ లాభాపేక్ష కోసమే పరిపాలన చేశారు. కమిషన్ల కోసమే ప్రాజెక్టులు కట్టించారు. ప్రజల కోసం ప్రజా చైతన్యం కోసం పురుడు పోసుకున్న తెలంగాణ జన సమితి పార్టీని ఆనాటి పాలకులు ప్రొఫెసర్ కోదండరాం సార్ చేసినటువంటి పోరాటాలను అడ్డుకున్నారు. నిరుద్యోగుల కోసం ప్రొఫెసర్ కోదండరాం సార్ పిలుపునిస్తే సార్ ఇంటి తలుపులు పగలగొట్టారు. సార్ను నిర్బంధించారు ఇవన్నీ చూస్తున్న ప్రజలు పాలకులకు తగిన బుద్ధి చెప్పారు.ఇప్పుడు ఉన్నది తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఇప్పుడు నిర్బంధాలు లేవు రైతులకు సంకెళ్లు లేవు అందరిని కలుపుకుపోతూ సమన్యాయం చేస్తూ పరిపాలనలో మాకు భాగం కల్పించి ప్రొఫెసర్ కోదండరాం సార్ ను గుర్తించి ఎమ్మెల్సీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజల కోసం ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తూ వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని అన్నారు.మే 12 న హైదరాబాద్ జల విహార్ లో జరగబోయే ప్లీనరీకి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మేధావులు,నిరుద్యోగులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు అందరు పెద్ద ఎత్తున రావాలని కోరుకుంటూ వరంగల్ ప్రెస్ క్లబ్ లో జరగబోయే పార్టీ ప్లీనరీ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం సార్ హాజరవుతున్నారు కావున అందరు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్, రాష్ట్ర కమిటీ సభ్యులు భోనగాని రవీందర్,మైనార్టీ సెల్ నాయకులు సంధాని ములుగు జిల్లా కార్యదర్శి శివ, తదితరులు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో సహజంగానే చాలా మంది పండ్లను ఎక్కువగా తింటారు.. అందుకు కారణాలు ఇవే



వేసవి కాలం వచ్చిందంటే చాలామంది భోజనం కంటే పుచ్చకాయ, తర్బూజ, నారింజ వంటి నీటి శాతం అధికంగా ఉండే పండ్లపైనే ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. ఎండలు పెరిగే కొద్దీ శరీరం సహజంగానే చల్లదనాన్ని, తేమను అందించే ఆహారాలవైపు మొగ్గుచూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది కేవలం రుచికి సంబంధించిన విషయమే కాకుండా, శరీరం తన అవసరాలకు అనుగుణంగా స్పందించే సహజ ప్రక్రియ అని వివరిస్తున్నారు. వేసవిలో చెమట ద్వారా శరీరం ఎక్కువ ద్రవాలను కోల్పోతుంది. దీంతో శరీరానికి నీటి అవసరం పెరుగుతుంది. ఈ సమయంలో పుచ్చకాయ, దోసకాయ, తర్బూజ వంటి నీటి శాతం అధికంగా ఉండే పండ్లు శరీరానికి తేమను అందించడమే కాకుండా తక్షణ శక్తిని కూడా ఇస్తాయి. అందుకే భారమైన, పొడి ఆహారాల కంటే ఈ పండ్లే ఎక్కువగా తినాలనిపిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

### నీటి శాతం ఉన్న పండ్లను తినాలి..

పోషకాహార నిపుణుల ప్రకారం దాహం, ఆకలి సంకేతాలను మెదడు దగ్గరగా నియంత్రిస్తుంది. చాలాసార్లు శరీరానికి నీరు అవసరమైనప్పుడు కూడా ఆకలిగా అనిపిస్తుంది. అలాంటి సమయంలో నీటి శాతం ఎక్కువగా ఉన్న పండ్లు తీసుకోవడం ద్వారా దాహం, తేలికపాటి ఆకలి రెండూ తీరుతాయి. అలాగే చల్లగా, రసంతో నిండిన ఆహారాలు వేసవిలో శరీరానికి మరింత సౌకర్యంగా అనిపిస్తాయి. పుచ్చకాయ వంటి పండ్లను తినేటప్పుడు నీరు తాగినట్లే చల్లదనాన్ని కలిగిస్తాయి. అందుకే వేడిగా ఉండే, నూనె ఎక్కువగా ఉన్న ఆహారాల కంటే ఇవే ఎక్కువ ఆకర్షణీయంగా అనిపిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి.

### తేలికపాటి ఆహారాలపై పెరిగే ఆసక్తి..

ఎండాకాలంలో శరీర ఉష్ణోగ్రత పెరగకుండా ఉండేందుకు శరీరం సహజంగానే జీర్ణక్రియను తక్కువ చేయడానికి ప్రయత్నిస్తుంది. భారమైన భోజనం జీర్ణం కావడానికి ఎక్కువ శక్తి అవసరం అవుతుంది. దీంతో శరీరంలో వేడి కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే వేసవిలో చాలామందికి ఆకలి తగ్గి తేలికపాటి ఆహారాలపై ఆసక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. నీటి శాతం అధికంగా ఉండే పండ్లలో సహజ చక్కెరలు కూడా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. అదే సమయంలో కడుపు భారంగా అనిపించకుండా తాజాగా ఉంచుతాయి. అందువల్ల వేసవిలో పండ్లు తినాలనిపించడం శరీరం ఇచ్చే సహజ సంకేతమని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే కేవలం పండ్లపైనే ఆధారపడకుండా, తేలికపాటి పోషకాహారంతో కూడిన భోజనాన్ని కూడా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేస్తే శరీరానికి తగిన తేమతో పాటు అవసరమైన పోషకాలు కూడా అందుతాయని చెబుతున్నారు.

# రైతులకు సౌర విద్యుత్తుతో ఆర్థిక భరోసా - ఏడిఈ తిరుపతి



**పర్వతగిరి,తరంగాలు(మే 07) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం ద్వారా లక్షలాది కుటుంబాలు ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందుతున్నాయని, అందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యుత్ శాఖ అధికారి వాంకుడోత్ తిరుపతి అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన ప్రజాపాలనా ప్రగతి ప్రణాళిక లో భాగంగా రేషన్ కార్డు కలిగిన అర్హులైన గృహ వినియోగదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ఈ పథకం ప్రజలకు భారీ ఆర్థిక భరోసా కల్పిస్తోందని అన్నారు. మండల రైతాంగానికి 24 గంటల ఉచిత వ్యవసాయ విద్యుత్ సరఫరా కొనసాగుతోందని,మండలం లో అన్ని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు రైతులకు నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. పియం కిసాన్ కుసుమ్ సోలార్ ఫథకం ద్వార రైతులు ఉత్పత్తి చేసే విద్యుత్‌ను డిస్కంల ద్వారా తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయించిన స్థిర ధరకు 25 సంవత్సరాల పాటు కొనుగోలు చేస్తాయని తెలిపారు. వ్యక్తిగత రైతులు, రైతు సమూహాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు ఈ పథకానికి అర్హులని వెల్లడించారు. "వ్యవసాయాన్ని సోలార్‌తో జోడించి రైతుకు స్థిరమైన ఆదాయం -- దేశానికి స్వచ్ఛ ఇంధనం అందిద్దాం" అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రైతులు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సర్పంచ్ లు, విద్యుత్ శాఖ అధికారులు, రైతులులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి





- నల్గొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శివ శంకర్ రెడ్డి

**నల్గొండ అర్బన్, మే 7, తరంగాలు :** దేవరకొండ బస్టాండ్ ప్రాంగణంలోని శివ గంగా ట్రేడర్స్, తిరునాల రోటరీ ఆయిల్ మిల్ మరియు నందిని సంస్థలను నల్గొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శివ శంకర్ రెడ్డి తనిఖీ చేశారు.ఈ తనిఖీల సందర్భంగా చెల్లుబాటు అయ్యే ఫుడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు, అలాగే 15 లీటర్ల టిన్ల నుంచి గానుగ యంత్రం ద్వారా లూజ్ ఆయిల్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు.ఈ చర్యల్లో భాగంగా మూడు అనుమానిత ఆయిల్ నమూనాలను విశ్లేషణ కోసం సేకరించారు. అదనంగా, మంచి నాణ్యత కలిగిన వేరుశెనగలను మాత్రమే వినియోగించాలని, గానుగ కేంద్రాలలో నాణ్యమైన ముడి పదార్థాలను ఉపయోగించాలని, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా మరియు శుభ్రతతో నిర్వహించాలని, ముడి పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయాలని, అలాగే ప్రజలు లూజ్ ఆయిల్స్ కొనుగోలు చేయకుండా జాగ్రత్తలు పాటించాలని వ్యాపార నిర్వాహకులు మరియు వినియోగదారులను హెచ్చరించారు.ప్రజారోగ్య పరిరక్షణ కోసం అన్ని ఫుడ్ బిజినెస్ నిర్వాహకులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్స్ పొందుతూ, ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని సూచించారు.

# ఇల్లంద నుండి కొండగట్టుకు పాదయాత్ర





**వర్ధన్నపేట ప్రతినిధి, మే 7,తరంగాలు :** హనుమాన్ మాలదారణ స్వీకరించిన భక్తులు మాల విరమణకు కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు.వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన ఇద్దరు హనుమాన్ మాల ధారణ భక్తులు గురువారం సాయంత్రం ఇల్లంద గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురు స్వాములు కంచె సాయి కుమార్, ముద్దరబోయిన వెంకటరమణ ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడి కట్టుకొని యాత్ర ప్రారంబించారు. సుమారు 175 కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్ర మొదటగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శించుకుని కొండగట్టు క్షేత్రానికి చేరుకుంటారు.నాలుగు రోజులపాటు పాదయాత్రగా వెళ్లి హనుమాన్ జయంతి నాటికి కొండగట్టుకు చేరుకోనున్నట్లు తెలిపారు. పాదయాత్రగా బయలుదేరిన హనుమాన్ భక్తులకు మంగళహారతులు,ప్రత్యేక పూజలతో తోటి హనుమాన్ స్వాములు కుటుంబ సభ్యులు వీడ్కోలు పలికారు.

## ఐనవోలు నుండి కొండగట్టుకు పాదయాత్ర





**ఐనవోలు, మే 7,తరంగాలు :** ఐనవోలు గ్రామ హనుమాన్ మాల దారణ స్వాములు 11 మంది శ్రీ ఆంజనేయ స్వామి ఇరుముడి కట్టుకుని కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. సుమారు నాలుగు రోజులు పాదయాత్ర చేసి వేములవాడ మీదుగా 150 కిలోమీటర్లు పాదయాత్ర చేసి కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని మాల విరమణ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ పాదయాత్రలో తీగల రాజు, పులి సాగర్, దొంతూరి సాయిచంద్, దొంతూరి సాయి కిరణ్,దొంతూరి రంజిత్, దొంతూరి బబ్లూ, దొంతూరి వికాస్,తీగల సిద్దు,తీగల సన్నీ, వీరస్వామి, సోల్తి శ్రీ చరణ్ స్వాములు వెళుతున్నారు.